గృహయోగం

సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల మోములు ఆనందపరవశమయ్యాయి. నియోజక వర్గంలో మొదటి విడతగా బుధవారం 500 గృహాలకు గృహప్రవేశాలు జరగడంతో కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని నివాస గృహ సముదాయాలు సందడిగా కనిపించాయి. నేతలు, అధికారులు స్వయంగా హాజరై టిడ్కో లబ్ధిదార్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలను అందజేశారు. –నరసరావుపేట


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్


టిడ్కో లబ్ధిదార్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలను అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



టిడ్కో గృహప్రవేశాల కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు, నాయకులు

క్లుప్తంగా

సర్వే పనుల పరిశీలన

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో నిర్వహిస్తున్న భూసర్వే పనులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పార్థసారధి పరిశీలించారు. సర్వే నిర్వహణలో సర్వేయర్‌లు అవలంబిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా సర్వేలో వచ్చిన మార్పులు గురించి పార్థసారధి వారికి వివరించారు. సర్వే నిర్వహణ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి, గ్రామ సర్వేయర్ లక్ష్మణ్, వీఆర్వో సురేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యడ్లపాడు: శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని తిమ్మాపురంలో బుధవారం జరిగింది. బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో తమ బంధువుల ఇంట్లో ఓ శుభ కార్యం ఉండటంతో యడ్లపాడు ఎగువ ఎస్సీ (పైపల్లె)కు చెందిన కొందరు ఆటోలో బయలుదేరారు. ప్రయాణమైన కొద్దిసేపటికే ఊరుదాటి తిమ్మాపురం చేపలచెరువు సమీపంలోకి రాగానే వారు ప్రయాణించే ఆటో టైరు పగిలి పోయింది. దీంతో వేగంలో ఉన్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా వారిని 108 వాహన సిబ్బంది చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారందరూ మరొక ఆటోలో గమ్యస్థానానికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

పారిశుద్ధ్య కమిటీ పరిశీలన

బొల్లాపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పీర్ కమిటీ మండలంలోని గుట్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం పరిశీలించారు. ఆ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ అంతర్గత రహదారులు, సైడ్‌కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీలో ఈవోపీఆర్‌డీ టి. పార్వతి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై పూర్తి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కమిటీలో బొల్లాపల్లి పంచాయతీ సర్పంచ్ శిఖా జ్యోత్స్న, పలుకూరు పంచాయతీ కార్యదర్శి శ్యామల తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ

నాదెండ్ల: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గణపవరం చండి రంగనాయకులు కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. 132 మందికి గాను 12 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకూ పరీక్షలు జరగ్గా 27 మందికి గాను 8 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా దావిడ్ లివింగ్‌స్టన్, అధికారిగా వై.రమేష్ బాబు పర్యవేక్షించారు. సెంటర్‌ను స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.

తూబాడులో రీసర్వే పనులు

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పనులు ప్రారంభమయ్యాయి. రీసర్వే పనులను సాతులూరు వీఆర్వో మురళీకృష్ణ ఇన్‌చార్జిగా పర్యవేక్షిస్తున్నారు. వీఆర్వో అనూష, అంజలి, సచివాలయ కార్యదర్శులు షేక్ నాగూర్‌బాష, షేక్ సైదాబి, త్రిపాల్‌లు సర్వే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్వే చేపట్టిన భూములకు సంబంధించిన రైతులు దస్తావేజులు, సంబంధిత ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. సమస్యలున్నట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండలం తెల్లబాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.పౌలు, సుధాకర్, చార్వాక, వీరయ్య, అంబటిపూడి వెంకటేశ్వర్లు, కె.వెంకట్రావు, జంగా కృష్ణలతో పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో శిక్షణ

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వేసవిలో బాల బాలికలకు వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల పీడీ రాగుల రాధా కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఈ నెల 1వ నుంచి 25 వరకు వేసవి క్రీడా శిబిరం నిర్వహించామని బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో 25 మంది బాల బాలికలకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఆయనతో పాటు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ ఈ.శివ శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయలు జాలాది శ్రీనివాసరావు, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, కోచింగ్ క్యాంపు సహాయకురాలు జాన్సీ పాల్గొన్నారు.

పేదలు ఆర్థికంగా ఎదిగేలా సుపరిపాలన

- అందరికీ విద్య, వైద్యం, గృహాలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పేదలు ఆర్థికంగా ఎదిగేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. వారి అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావిపౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16 వేల కోట్లతో గ్రామస్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం అవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, మేరం శ్రీనివాసరావు, ముత్యాల రామారావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, ఉప్పు పెదగంగయ్య, ముత్యాల వెంకయ్య, తిమ్మిశెట్టి నాగాంజనేయులు, ఉప్పు శ్రీనివాసరావు, తిమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, పగడాల శ్రీనివాసరావు, ఆలూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పాస్ పుస్తకాలు అందజేస్తున్న వీఆర్వో నాగయ్య


వేలిముద్రలు తీసుకుంటున్న తహసీల్దార్

లబ్ధిదారుల చేతికి జగనన్న భూహక్కు పత్రాలు

రొంపిచర్ల మండలంలోని ముత్తనపల్లి గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను తహసీల్దార్ అంకారావు పంపిణీ చేశారు. గతంలో పట్టాలు లేనివారికి కూడా వారి భూములను సర్వే నిర్వహించి పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ముత్తనపల్లి గ్రామ పరిధిలో 1555 మందికి ఖాతా పుస్తకాలు ఉండగా ఇప్పటికి 255 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ప్రతి రైతు వేలిముద్రలు తీసుకొని పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భాగ్యలక్ష్మీ, వీఆర్వో నాగయ్య, గ్రామ సర్వేయర్ ఖాజా, సాగర్, పురుషోత్తమ్ పాల్గొన్నారు. –రొంపిచర్ల

ఆధార్ ప్రామాణిక పరీక్షలో తప్పితే కఠిన చర్యలు


సమావేశంలో సచివాలయ ఉద్యోగితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ఆధార్ నిర్వహణకు ఎన్ఎస్ఈఐటీ నిర్వహిస్తున్న ప్రామాణిక పరీక్షలలో డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసర్లు ఉద్దేశపూర్వకంగా ఉత్తీర్ణత సాధించకుండా ఉండే వారిపై కఠినచర్యలు తీసుకోవడంతో పాటు జీతభత్యాలు నిలుపుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ ఎల్. శివశంకర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేడ్కర్ హాలులో కమాండ్ కంట్రోల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై కమాండ్ కంట్రోల్ సిబ్బంది క్షేత్రస్థాయిలోని ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తూ సరైన సమాచారాన్ని రాబట్టాలని ఆయన సూచించారు. విద్య, ఆరోగ్యశాఖలో సమన్వయంతో పనిచేసి రక్తహీనత ఉన్న బాలికలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను సకాలంలో అందించాలన్నారు. రక్తహీనత ఎక్కువగా ఉన్న పిల్లలు ఎంతమంది, ఎంత మందికి డాక్టర్ సేవలు అందిస్తున్నారు వివరాలను ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో పొందుపరచాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న వైయస్సార్ సంపూర్ణ పోషణ, హాట్ కుక్కుడ్ మీల్స్ సకాలంలో అందరికి అందించేలా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి గురువారం చీఫ్ సెక్రటరీ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు సరైన నివేదికలు ఉండేలా అందించాలన్నారు. బాలామృతం అందించే ప్రక్రియలో కాలం చెల్లిన వాటిని వినియోగించకుండా ఉండేలా సంబంధిత వారికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అమ్మఒడి అందని అనాథ బాలల పూర్తి వివరాలు సేకరించి తక్షణమే అమ్మఒడి నగదు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 242 మందిని గుర్తించడం జరిగిందని, 157 మంది వివరాలు పూర్తిగా సేకరించారని, మిగిలిన వారి వివరాలను కూడా సేకరించి సకాలంలో నగదును అందజేయాలన్నారు. 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు వస్తున్న కాల్స్‌పై పూర్తిస్థాయిలో నివేదికను అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి అరుణ, గ్రామ వార్డు సచివాలయాలు అధికారి మహాలక్ష్మి, కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నెరవేర్చాలి

వాడివేడిగా యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పిడతల ఝాన్సీ పక్కన ఎంపీడీవో వై హనుమారెడ్డి

యడ్లపాడు: సమస్యల్ని పరిశీలించి పరిష్కరించడం.. ప్రజాప్రతినిధుల్ని గౌరవించడం అధికారులు ప్రథమ కర్తవ్యంగా గుర్తించాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. ఎంపీడీవో వై హనుమారెడ్డి అధ్యక్షతలో యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా శాఖల వారీగా ప్రగతి నివేదికలను వివరించాలని ఎంపీపీ కోరారు. తొలిగా ఎంఈవో ఐఆంజనేయులు విద్య విషయాలను తెలిపారు. 2022–23 పది వార్షిక పరీక్షలకు 460 విద్యార్థులు రాయగా, వారిలో 253 మంది ఉత్తీర్ణులై మండలం 55శాతం నమోదైందన్నారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్‌కుమార్, ఎం శ్రీనివాసరెడ్డి లేచి భావించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సర్కారు బడుల రూపురేఖల్ని మార్చి గొప్ప విద్యా పథకాలు తెచ్చి రూ.కోట్ల వ్యయంతో అన్నింటికీ ఉచితంగా అందిస్తుంటే..క్వాలీఫైడ్ టీచర్లు కొందరు క్వాలిటీ విద్యను అందించక పోవడం, అధికారుల సరైన పర్యవేక్షణ కొరవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని మండిపడ్డారు. వివిధ శాఖల అధికారులు నివేదిక తర్వాత ఎంపీపీ ఝాన్సీ మాట్లాడారు. మండలం పరిధిలోని పలు సమస్యల్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదలై సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. కొత్తసొలస అంగన్‌వాడీ భవనం పూర్తయి త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు వచ్చే మీటింగ్‌లో రిపీట్ కాకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగుకు సిద్ధమైన రైతులకు అనుకూలమైన విత్తనాలు తెప్పించేలా ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

యడ్లపాడు జెడ్పీహైస్కూల్లో ఈ ఏడాది నుంచి బాలికల ఇంటర్మీడియెట్ కళాశాల అందుబాటులోకి వచ్చిందని, ఇక్కడ ఎంపీసీ, బైపీసీ కోర్సులు బోధిస్తారని సభ్యులు ఈ విషయంలో ప్రజల్ని చైతన్యం చేసి కళాశాల విద్యకు ప్రోత్సాహం అందించాలని కోరారు.

జూనియర్ కళాశాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతనంగా జూనియర్ ఇంటర్ బాలికలు కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నూతన దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమంపై కరపత్రాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటరు కళాశాల ఎంపీటీసీ, బైపీసీ విభాగాల్లో ప్రత్యేకంగా ఏడు మంది ఉపాధ్యాయులను నియమకం చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాల్లో ప్రభుత్వం అందించే సౌకర్యాలు గురించి వివరించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, శ్రీకాంత్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఈపూరు ఎస్ఐ బదిలీ

ఈపూరు: స్థానిక ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న విప్పర్ల వెంకట్రావు పెదకూరపాడుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతానికి ఈపూరు ఇన్‌చార్జి ఎస్ఐగా బండ్లమోటు ఎస్ఐ బలరాం రెడ్డి వ్యవహరిస్తున్నారు. వెంకట్రావు ఈపూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో సాధారణ బదిలీలో భాగంగా బదిలీ అయ్యారు.

వినుకొండ ఎస్‌హెచ్‌వోగా సాంబశివరావు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ టౌన్ ఎస్‌హెచ్‌వోగా ఎస్. సాంబశివరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా కనిగిరి నుంచి బదిలీపై వినుకొండకు వచ్చారు. వినుకొండలో పనిచేస్తున్న అశోక్‌కుమార్ గుంటూరు వీఆర్‌కు వెళ్లారు. శాంతిభద్రతలు కాపాడటమే కాకుండా నేరాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తానని సీఐ తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లయితే తమ దృష్టికి తేవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళలు కూడా మహిళా పోలీసుల సహకారంతో తమపై జరుగుతున్న అన్యాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పారదర్శకతతో సబ్‌ప్లాన్ అమలు కావాలి

గిరిజన బడ్జెట్ వాచ్, రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలులో పాలకులకు పారదర్శకత అవసరమని, ఏయే వర్గాలకు ఆర్థిక స్వావలంబన ప్రణాళికలు సిద్ధం చేసేలా చట్టాన్ని బలోపేతం చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ. జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశం ఏర్పాటులో దేవకుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూలన పథకాలు ఊరి చివరనున్న షెడ్యూల్ కులాలు, ఊరి అవతల ఉన్న షెడ్యూల్ తెగలకు ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అసమానతలు తొలగించడంలో ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో మార్పులు తీసుకు రాలేకపోయాయన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మల్లెల అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అడపామోహన్, జనజాగృతి మండలి అధ్యక్షురాలు పిడతల రమాదేవి, రేపూడి కుమారి, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ రమణమూర్తి మాట్లాడగా, మహిళా నాయకులు మేడే వెంకట రమణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

28న పెరియార్ సమకాలీనతపై సదస్సు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: స్థానిక ఎన్జీవో హోంలో పెరియార్–సమకాలీనత అంశంపై ఈనెల 28న సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ముస్లిం హక్కుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పొనుగుపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్–జాషువా–పూలే–పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెరియార్ సమకాలీన సదస్సు ఆహ్వాన పత్రికలను ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వాలు సామాజిక, సాంస్కృతిక రంగాలను ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనారిటీ ముస్లిం వర్గాలపై దాడులు, హత్యలకు ఉపయోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని పెరియార్ రామస్వామి ముందుగానే ఊహించి ఆ రోజుల్లోనే ఈ రుగ్మతలకు తన సిద్ధాంతం, పోరాటాల ద్వారా పరిష్కారం చూపారని వివరించారు. ఈనెల 28న పెరియార్ రీడర్ పుస్తక పరిచయసభ జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, ఎంఐఎం పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి, ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖనం చిన్న పాల్గొన్నారు.

59 మంచినీటి చెరువుల ఎంపిక

శావల్యాపురం: అమృత సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో 59 రక్షిత మంచినీటి చెరువులు ఎంపికైనట్లు వినుకొండ క్లస్టర్ ఉపాధి పథకం ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు, శావల్యాపురం గ్రామ పంచాయతీల్లో మంచినీటి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో 17 మంచినీటి చెరువులను ఎంపిక చేయగా శావల్యాపురం మండలంలో గంటావారిపాలెం, వేల్పూరు, శావల్యాపురం గ్రామాల్లోని మంచినీటి చెరువులను ఎంపికయ్యాయి. ఇందులో భాగంగా శావల్యాపురం గ్రామంలో మంచినీటి చెరువు పనులు పూర్తి అయినట్లు చెప్పారు. త్వరలో కేంద్ర బృందం పర్యటన చేయు సందర్భంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పనులు పురోగతి పరిశీలిస్తున్నామన్నారు.

నియోజకవర్గంలో ఉపాధి పనులు ప్రతిరోజు 35 వేల మంది పనులు చేస్తున్నట్లు చెప్పారు. కూలీలకు సంబంధించి వేతనాలు పెండింగ్ లేనట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచులు రంతు శ్రీనివాసరావు, యాగసిరి చెన్నమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఏపీవో టి.పద్మజా, టీఏ సుధాకర్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలు సమర్థంగా పరిష్కరించండి


సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సమర్థవంతమైన పాత్ర పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ అతిథిగృహంలో రెవెన్యూ శాఖ సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌలు రైతు కార్డులు పంపిణీ, సకాలంలో వారు వ్యవసాయం చేసుకోవడానికి అవసరమైన రుణాలను బ్యాంకర్ల ద్వారా లక్ష్యం మేరకు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ శాఖలు కమిటీగా ఏర్పడి కౌలు రైతులకు మేలు చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన వ్యవసాయ సాగు సంబంధించి, అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో విత్తనాల కొరత, బ్లాక్ మార్కెటింగ్ విక్రయాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఉన్న విత్తన విక్రయ డీలర్ షాపులపై తనిఖీలు నిర్వహించి నివేదిక అందజేయాలన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలకు సంబంధించి పరిహారం విషయంలో కమిటీ అందిస్తున్న నివేదికలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటూ త్వరితంగా పరిహారం అందజేయాలన్నారు. ఆత్మహత్యలకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేసి రైతుల కుటుంబాలకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాలలో రెవెన్యూ సేవలు మరింత మెరుగ్గా అందించాలన్నారు. ఏపీ సేవ పోర్టల్ ద్వారా నివేదికలను సకాలంలో ప్రభుత్వానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లు ప్రతినెల 20 నుంచి 30 లోపు ఎంఎల్ఎస్ పాయింట్లు, చౌక ధరల దుకాణాల కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టి నివేదికను ప్రభుత్వానికి పంపాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి కె.వినాయకం, డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ




శావల్యాపురం: వేసవిలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలికితీయడానికి సెలవుల్లో సరదాగా కార్యక్రమం ప్రభుత్వం రూపొందించినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మాట్లాడుతూ ప్రథం సంస్థ సారథ్యంలో ఎంపీపీ పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు డ్రాయింగ్, చిత్రాలు తయారు చేయటం ఆటలు ద్వారా గణిత ప్రక్రియ చేయడానికి సెలవుల్లో సరదాగా పుస్తకాన్ని రూపొందించి విద్యార్థులకు అందజేశారు. మండలంలోని తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ పాఠశాల్లోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు పాఠశాల ఉపాధ్యాయులు రాజా రమేష్ తెలిపారు.

నాగనందినికి పీహెచ్‌డీ



నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ లక్ష్మీ నాగనందిని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం డీన్ సూర్యకుమారి అధికారికంగా పీహెచ్‌డీ పట్టాను అందించారు. నాగనందిని ఎమ్మెస్సీ హార్టికల్చర్‌లో గోల్డ్‌మెడల్ సాధించి డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్నారు. మొక్కల సస్యరక్షణపై చేసిన పరిశోధనలు సఫలీకృతం కావటంతో డాక్టరేట్‌ను అందుకున్నారు. నాగనందిని స్వస్థలం నెల్లూరు జిల్లా కావలి కాగా గణపవరం గ్రామానికి చెందిన సతీష్‌ను వివాహం చేసుకుని గణపవరంలో స్థిరపడ్డారు.

నేడు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు


మట్టుపల్లి మోహన్

నరసరావుపేట ఈస్ట్: మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2023 పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఈనెల 25వ తేదీన ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్నట్టు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ బుధవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో సాయంత్రం 5గంటల నుంచి ప్రతిభా పురస్కారాలను అందిస్తామన్నారు. పదవ తరగతి స్టేట్ సిలబస్, ఐసీఎస్ఈ సిలబస్‌లో 550 పైబడిన మార్కులు, సీబీఎస్ఈ సిలబస్‌లో 450 పైబడిన మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు తమ గుర్తింపు కార్డు (ఆధార్, స్కూల్ ఐడీ కార్డు), పదవ తరగతి ఇంటర్నెట్ మార్కుల జాబితా తీసుకొని రావాలన్నారు. విద్యార్థులు తమ పేర్లను 8978180847, 9347626288 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారం క్రింద సర్టిఫికెట్, జ్ఞాపిక, నగదు బహుమతి అందిస్తామని స్పష్టం చేశారు.